సాక్షి నంద్యాల

బుధవారం । 26 ఏప్రిల్ । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని నిత్యకళావేదికపై మంగళవారం నంద్యాలకు చెందిన జీవీఎస్ శ్రీవల్లి, బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



రమణీయం.. రథోత్సవం

కోడుమూరు రూరల్: పులకుర్తి గ్రామంలో మంగళవారం సాయినాథుడి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయినాథుడి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



దొరపల్లె కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

డోన్ టౌన్: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన డోన్ పట్టణ సమీపంలోని దొరపల్లె జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు. జిల్లాలోనే అతి పెద్ద లేఅవుట్‌గా ఉన్న డోన్ జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ శాఖ విఫలం చెందిందని కమిషనర్ వెంకటేశులుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే మంచి నీటి వసతిని కల్పించాలని హెచ్చరించారు. సకాలంలో బిల్లులు చెల్లించి లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ విద్యా సాగర్, హౌసింగ్ ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ సతీష్, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు గడువు పెంపు

నంద్యాల(సిటీ): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశానికి, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగిస్తున్నట్లు డీఈఓ అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలోని 27 కేజీబీవీలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును http:// apkgbv. apcfss. in సైట్ ద్వారా పొందవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. వివరాలకు 9000109934ను సంప్రదించాలన్నారు.

గౌరవ వేతనానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతన పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబిహా పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మసీదుల ముతవల్లిలు, ప్రెసిడెంట్లు ఈ గౌరవ వేతనం పొందేందుకు అర్హులన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో అందించాలన్నారు. గౌరవ వేతనం పొందేందుకు మసీదు బ్యాంకు ఖాతా, మసీదు పాన్ కార్డు/ప్రెసిడెంట్ పాన్ కార్డు, ముతవల్లి/ప్రెసిడెంట్ ఆధార్ కార్డు, ఇమామ్ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్, మౌజన్ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ కలర్ జిరాక్స్ కాపీలతో అందజేయాలన్నారు.

‘ఆన్‌లైన్’ ఆటగాళ్లు!

ఐపీఎల్ మ్యాచ్‌లపై జోరుగా బెట్టింగ్

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెలరేగుతున్న బుకీలు
- డఫ్ఫా బెట్టింగ్ డాట్ కాంలో తలమునకలు
- ఫలితాలు తారుమారై రూ.కోట్లలో నష్టం
- ఉచ్చులో వ్యాపారులు, ఉద్యోగులతో పాటు విద్యార్థులు
- సీజన్ ముగిసేలోపు రూ.150 కోట్లకు పైగా బెట్టింగ్‌కు అవకాశం



➡ గత సోమవారం. సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్), ఢిల్లీ కాపిటల్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్. ఢిల్లీ 144 పరుగులకు ఆలౌట్ అయింది. ఎస్ఆర్‌హెచ్ సులభంగా గెలుస్తుందని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో బుకీలు కూడా 10:18 వరకూ బెట్టింగ్ నిర్దేశించారు. మ్యాచ్ 6 ఓవర్లు ముగిశాక ఎస్ఆర్‌హెచ్‌కు అనుకూలంగా 10:20 వరకూ వెళ్లింది. దీంతో అంతా ఎస్ఆర్‌హెచ్ వైపు బెట్టింగ్ కాశారు. ఇందులో కంటోన్మెంట్ వద్ద ఉన్న వ్యాపారుల్లో ఓ ప్రముఖ వ్యక్తి ఎస్ఆర్‌హెచ్ వైపు రూ.20లక్షలు కాశాడు. అనూహ్యంగా మ్యాచ్ డీసీ గెలిచింది. అతనితో పాటు ఎస్ఆర్‌హెచ్‌పై బెట్టింగ్ కాసిన వారంతా చేతులు కాల్చుకున్నారు.

➡ ..ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉండటం, ఆఫ్‌లైన్‌తో పనిలేకుండా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో అధికశాతం మంది ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మునిగి తేలుతున్నారు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఐపీఎల్ ప్రతీ మ్యాచ్ హోరాహోరీగా నడుస్తుండటం.. గెలుస్తుందనుకునే జట్టు ఓడుతుండటంతో బెట్టింగ్‌రాయుళ్ల అంచనాలు తలకిందులవుతున్నాయి. వారి ఖాతాల్లోని డబ్బు ఆన్‌లైన్లో ఆవిరవుతోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విచ్చలవిడిగా బెట్టింగ్ సాగుతోంది. గత సీజన్‌లో కర్నూలులోని బి.క్యాంప్, అశోక్‌నగర్‌లలో ఇంటర్నెట్ దుకాణాల్లో బెట్టింగ్ రాయుళ్లను అరెస్టు చేశారు. ఇతర పట్టణ ప్రాంతాల్లో కూడా పలు అరెస్టులు జరిగాయి. దీంతో చాలా వరకూ బెట్టింగ్‌రాయుళ్లు ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో ఆడుతున్నారు. సెల్‌ఫోన్‌లో చూస్తూ బెట్టింగ్ నడుపుతున్నారు. దీంతో ఈ బెట్టింగ్ నివారణ పోలీసులకు కూడా సవాల్‌గానే మారింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఎక్కువమంది డఫ్ఫా బెట్టింగ్ యాప్‌ను వినియోగిస్తున్నారు. దీంతో పాటు మరో 30 యాప్స్ ఉన్నాయి. వీటిలో మ్యాచ్‌కు గంట ముందే కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. అందులోనే బెట్టింగ్ కాయాలి. మ్యాచ్‌కు ముందు రేటింగ్స్ ఇస్తారు. ఆ ప్రకారం డిపాజిట్‌లోని కొంత మొత్తాన్ని బెట్టింగ్ కాయొచ్చు. మ్యాచ్ సాగేతీరును బట్టి రేటింగ్స్ మారుతుంటాయి. అప్పుడు కూడా డిపాజిట్‌లో మిగిలిన మొత్తాన్ని మాత్రమే వాడాలి. డిపాజిట్ క్లోజ్ అయితే అప్పటికప్పుడు డిపాజిట్ చేసి బెట్టింగ్ కాసే అవకాశం ఉండదు. దీంతో చాలామంది రూ.50వేల నుంచి లక్షల రూపాయలు ముందుగానే యాప్స్‌లో డిపాజిట్ చేస్తున్నారు. మ్యాచ్ పరిస్థితి, రేటింగ్స్‌ను బట్టి అప్పటికప్పుడు ఆకర్షితులై భారీగా బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగ్‌లో సక్సెస్ అయితే క్షణాల్లో డబ్బు ఖాతాల్లో జమ అవుతుంది. లాస్ అయితే డెబిట్ అవుతుంది. ఇలా రెండు జిల్లాల్లో వందలాది మంది రోజూ వేల నుంచి లక్షల రూపాయలు నష్టపోతున్నారు.

ఈ ఏడాది తారుమారైన బెట్టింగ్ రాయుళ్ల భవితవ్యం

మ్యాచ్‌లు చివరి బాల్ వరకూ ఉత్కంఠగా సాగుతున్నాయి. దీంతో బెట్టింగ్‌రాయుళ్ల అంచనాలు తలకిందులవుతున్నాయి. ఆర్‌సీబీ(రాయల్ ఛాలెంజెర్స్ బెంగళూరు), లక్నో సూపర్ జేయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 212 పరుగులు టార్గెట్ ఉంచడంతో అన్ని బెట్టింగ్ యాప్స్ ఆర్‌సీబీ వైపు భారీగా రేటింగ్స్ ఇచ్చాయి. బుకీలు కూడా ఆర్‌సీబీకే రేటింగ్స్ ఇచ్చి బెట్టింగ్ ఆహ్వానించారు. అయితే మ్యాచ్‌లో లక్నో గెలిచింది. దీంతో అంతా భారీగా నష్టపోయారు. అలాగే కోలకతా నైట్‌రైడర్స్, గుజరాత్ జేయింట్స్ మ్యాచ్‌లో కేకేఆర్ ఆఖరి ఓవర్‌లో 6 బంతుల్లో 30 పరుగులు చేయాల్సి ఉంది. దీంతో అంతా గుజరాత్‌పై బెట్టింగ్ కాశారు. అయితే చివరి 5 బంతుల్లో 5 సిక్సులు కొట్టి రింకూ సింగ్ మ్యాచ్‌ను గెలిపించారు. ఈ మ్యాచ్‌లో కూడా బెట్టింగ్‌రాయుళ్లు బోరుమన్నారు. ఇలా ప్రతీమ్యాచ్‌లోనూ బాల్ బాల్‌కు బెట్టింగ్ కాస్తున్నారు. ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి? ఓవర్‌లో సిక్స్ వస్తుందా? లేదా? వేసే బాల్‌కు రన్ వస్తుందా? డాట్ బాల్ అవుతుందా? ఇలా ప్రతీ బాల్‌కూ బెట్టింగ్ కాస్తున్నారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాసేవారు సెల్‌ఫోన్ ఉంటే చాలు.. ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్ కాసేవారు నగరంలో బార్లు ఉన్న రెండు ప్రముఖ హోటళ్లలో గదులు అద్దెకు తీసుకుని అక్కడే కూర్చుని క్షణాల్లో నగదు చేతులు మార్చుకుంటున్నారు. మందు, ఫుడ్ గదులకు తెప్పించుకుని ఐపీఎల్‌లో బెట్టింగ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. మరికొంతమంది పంచలింగాల చెక్‌పోస్టు సమీపంలో కార్లలో కూర్చుని, పొలాల్లో మద్యం సేవిస్తూ సెల్‌ఫోన్‌లలో మ్యాచ్ చూస్తూ బెట్టింగ్ కాస్తున్నారు. నంద్యాలలో కూడా భారీగా బెట్టింగ్ సాగిస్తున్నారు. ఇందులో బాధాకరం ఏంటంటే విద్యార్థుల చదువు, భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు డబ్బు పంపుతుంటే ఆ డబ్బుతో కొందరు బెట్టింగ్ కాస్తున్నారు. వీరిలో ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించేవారు ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఇటీవల బెట్టింగ్ కాసి నష్టపోయిన కొన్ని ఉదాహరణలు

- డోన్ రోడ్డులోని ఓ రెస్టారెంట్ నిర్వాహకుడు ఈ సీజన్‌లో రూ.7లక్షల వరకు బెట్టింగ్‌లో నష్టపోయారు.
- కంటోన్మెంట్ పరిధిలోని ఓ ప్రముఖ వ్యాపారి ఈ సీజన్‌లో రూ.50లక్షలు బెట్టింగ్ కాసినట్లు తెలుస్తోంది. ఇందులో రెండు మ్యాచ్‌లో డబ్బులు వచ్చింది. తక్కిన మ్యాచ్‌లో నష్టపోయారు.
- షరాఫ్‌బజార్‌లోని ఓ బంగారు దుకాణం వ్యాపారి నిన్న ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో రూ.1.30లక్షలు నష్టపోయినట్లు తెలుస్తోంది.
- నంద్యాల టౌన్‌లో గాంధీనగర్, బొమ్మల సత్రంలో ఎక్కువగా బెట్టింగ్ జరుగుతోంది.
- నంద్యాలలో కూడా ఎక్కువగా సెల్‌ఫోన్‌లలోనే బెట్టింగ్ ఆడుతుండటం గమనార్హం.



బెట్టింగ్ జోలికి వెళితే బెండు తీస్తాం



క్రికెట్, మట్కా, గ్యాంబ్లింగ్ లాంటి వాటి జోలికి వెళితే బెండు తీస్తాం. జిల్లాలో కొంత మంది యువతను తప్పుదోవ పట్టిస్తూ బెట్టింగ్‌లకు పాల్పడేలా చేస్తున్నారు. అటువంటి వారి సమాచారం అందిన వెంటనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నాం. యాప్‌ల ద్వారా కొందరు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని, సమాచారం వస్తున్నందున వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాం. బెట్టింగ్‌కు పాల్పడకుండా కళాశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద యువతకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నంద్యాల జిల్లా

వైభవంగా నారసింహ జయంతి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహుడు,



సింహ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిల క్షేత్రంలో నారసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాలా నారసింహ స్వాములను అలంకరించి పూల పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా గాలిగోపురం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్దకు తోడ్కొనివచ్చారు. అనంతరం ఉత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. స్వామి, అమ్మవార్లను ఆశీర్వదించేందుకు వచ్చే ముక్కోటి దేవతలు, బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చే భక్తకోటికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా గరుత్మంతుడు అనుక్షణం కాపలా ఉంటాడని నమ్మకంతో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేద పండితులు తెలిపారు. రాత్రి సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఇంటర్మీడియెట్ ఫలితాలు

- ఆర్ఐఓ గురువయ్యశెట్టి

నంద్యాల(సిటీ): నేడు(బుధవారం) ఇంటర్ ఫస్టియర్, సెకండియర్, వొకేషనల్ పరీక్షల ఫలితాలు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేయనున్నట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి గురువయ్యశెట్టి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించడం తెలిసిందే. ఈ పరీక్షలకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం 35,788 మంది.. సెకండియర్‌కు సంబంధించి 40,849 మంది పరీక్షలు రాశారన్నారు. నేడు సాయంత్రం 5 గంటలకు ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు వెలువరిస్తారన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను https://examresults.ap.nic.in, www.bie.ap.gov.in వెబ్‌సైట్‌ల ద్వారా చూసుకోవచ్చన్నారు.

ప్రతి ఇంటా సంతోషం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, చిత్రంలో రామసుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య తదితరులు

- ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల్లో సంతృప్తి
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన
- వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు గెలుస్తాం
- లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య
- కోడుమూరులో లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటాం : ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు (కర్నూలు, నంద్యాల జిల్లాలు) ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ నుంచి జిల్లాలో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. జగనన్న పాలనలో తమకు ఎంతో లబ్ధి చేకూరిందని వివిధ వర్గాల ప్రజలు చెబుతున్నారన్నారు. 80 శాతం మంది ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు పార్టీ సెల్ నంబర్‌కు మిస్డ్ కాల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అతికిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ పాలనలోనే తమకు మేలు జరుగుతుందని ప్రతి కుటుంబం భావిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దకే పథకాలు అందించే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ 175 స్థానాల్లో విజయంసాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ రామయ్య మాట్లాడుతూ 2014 ఆగస్టు 15న జెండావిష్కరణకు వచ్చిన చంద్రబాబు జిల్లాకు 36 రకాల హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందని, ఆయన అధికారంలోకి వస్తే ఏమి చేస్తాడో చెప్పకుండా తమ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ నియోజకవర్గానికి వెళ్తే అక్కడి ఎమ్మెల్యేలపై అసత్య ఆరోపణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం పప్పు నాయుడు లోకేష్‌కు తగదని, పచ్చ మీడియాతో కలిసి తమపై విషం చిమ్మే ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ లోకేష్‌తో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు దళితులను అవమానించారన్నారు. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని చెప్పి తమ మనోభావాలు దెబ్బతీశారన్నారు. దీంతో పాటు ఆది నారాయణరెడ్డి, చింతమనేని ప్రభాకర్ సైతం ఎస్సీలు స్నానం చేయరని చులకనగా మాట్లాడారన్నారు. ఇందుకు లోకేష్ ఎస్సీలకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో కోడుమూరు నియోజకవర్గంలో యువగళం యాత్రను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు రాజగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, విక్రమసింహారెడ్డి, శ్వేతారెడ్డి, కృష్ణకాంత్, నాయకులు ఆదిమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల చదువుకు అన్నయ్య దీవెన

- నేడు జగనన్న వసతి దీవెన నిధుల జమ
- జిల్లాలో 35,447 మంది విద్యార్థులకు లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమకానున్న రూ.33.83 కోట్లు
- అనంతపురం జిల్లా నార్పల నుంచి సీఎం జగన్ నిధులు విడుదల



విద్యార్థులు

పేదింటి బిడ్డల ఉన్నత చదువులకు ఆర్థిక కష్టాలు అడ్డుకాకూడదని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఓ వైపు కళాశాల ఫీజు చెల్లించడంతో పాటు మరోవైపు వసతి కల్పనకు ఆర్థికంగా ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలతో పేదల ఇళ్లలో విద్యా వెలుగులు ప్రకాశిస్తున్నాయి. ఏటా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. వరుసగా నాల్గవ ఏడాది కూడా వసతి దీవెన నిధులు బుధవారం జమ కానున్నాయి.

నంద్యాల: పేదలకు చదువు భారం కాకూడదనే మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో సంక్షేమ పథకాలతో విద్యార్థులకు భరోసా కల్పిస్తూ.. మరో వైపు నాడు– నేడుతో విద్యాలయాలను రూపురేఖలు మార్చుతున్నారు. ఇదే క్రమంలో పేదల ఉన్నత చదువులే లక్ష్యంగా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారు. వసతి దీవెన పథకంలో భాగంగా విద్యార్థుల భోజన, హాస్టల్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. వారు చదివే కోర్సుకు అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం చేస్తోంది. వరుసగా నాలుగో ఏడాది కూడా నిధులు జమ చేస్తోంది. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పల నుంచి వసతి దీవెన డబ్బులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఈ ఏడాది నంద్యాల జిల్లాలో 35,447 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హత సాధించారు. జిల్లాలో రూ.33.83 కోట్లు లబ్ధిదారులకు చేరనుంది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ మొదలుకొని పీజీ, పీహెచ్‌డీ వరకు చదివే విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేస్తోంది. విద్యార్థుల హాస్టల్, మెస్ బిల్లులకు సంబంధించిన వసతి సొమ్మును తల్లి లేదా సంరక్షకుని అకౌంట్‌లో జమ అవుతోంది. వసతి దీవెన కింద ఐటీఐ చదివే విద్యార్థులకు రూ. 10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ. 15 వేలు, డిగ్రీ అంత కంటే ఉన్నత చదువులు చదివే వారికి రూ. 20 వేలు అందజేస్తారు. కరోనా కష్టకాలంలో సైతం విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు వసతి దీవెన డబ్బులు అందజేశారు. ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా వరుసగా నాల్గవ ఏడాది క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జగనన్న వసతి దీవెన పథకం 2022–23 లబ్ధిదారులు

సంక్షేమ శాఖ	విద్యార్థులు	నిధుల మంజూరు (రూ..)
బీసీ	13,992	13,29,35,000
ఈబీసీ	3,894	3,77,27,500
కాపు	2,703	2,59,80,000
ముస్లిం	5,628	5,36,95,000
ఎస్సీ	8,090	7,70,87,500
ఎస్టీ	1,056	1,00,72,500
క్రిస్టియన్	84	8,25,000
మొత్తం	35,447	33,83,22,500

నియోజకవర్గాల వారీగా జగనన్న వసతి దీవెన లబ్ధిదారులు

నియోజకవర్గం	విద్యార్థులు	మొత్తం నగదు (రూ..)
ఆళ్లగడ్డ	6,036	5,84,02,500
బనగానపల్లె	6,453	6,12,45,000
డోన్	5,152	4,85,60,000
నందికొట్కూరు	5,326	5,07,07,500
నంద్యాల	6,066	5,83,05,000
పాణ్యం	1,800	1,70,52,500
శ్రీశైలం	4,614	4,40,50,000
మొత్తం	35,447	33,83,22,500

సీఎం మేలు ఎన్నటికీ మరువం



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నేను రెండవ సంవత్సరం బీకాం చదువుతున్నాను. మాది పేద కుటుంబం కావడంతో ఫీజులు, హాస్టల్ బిల్లులు చెల్లించాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు మొదటి ఏడాదికి సంబంధించి రూ.20వేలు ఇచ్చారు. నేడు రెండో ఏడాదికి సంబంధించి ఇస్తుండటం సంతోషంగా ఉంది. పేద విద్యార్థుల చదువుకు ఎంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రిని ఎన్నటికీ మరువం. – అహల్య, నంద్యాల

విద్యార్థులకు అండగా ప్రభుత్వం



పట్టణంలోని సాధన డిగ్రీ కాలేజీలో నేను బీకాం రెండవ సంవత్సరం చదువుతున్నాను. ఏడాదికి రూ.20 వేలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వసతి దీవెన కింద అందజేస్తున్నారు. పేదరికం కారణంగా చదువులు ఆపకూడదని సీఎం ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధిస్తా. పేద విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలు తోడ్పడుతున్నాయి. –జ్యోతి, నంద్యాల

విద్యకు అధిక ప్రాధాన్యత



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పేద విద్యార్థులకు చదువు భారం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద కాలేజీ ఫీజులు చెల్లిస్తూనే, వసతి దీవెన కింద హాస్టల్, భోజన ఖర్చులు సైతం ప్రభుత్వమే భరిస్తోంది. వరుసగా నాల్గవ ఏడాది జగనన్న వసతి దీవెన కింద అర్హులైన విద్యార్థులందరి తల్లులు లేదా వారి సంరక్షకుల ఖాతాల్లో ప్రభుత్వం నేడు నగదు జమ చేస్తోంది. – చింతామణి, సోషల్ వెల్ఫేర్ డీడీ, నంద్యాల

రుద్రమూర్తికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థం శ్రీశైలం రుద్రపార్క్‌లోని రుద్రమూర్తికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ రుద్ర విగ్రహాన్ని గతంలో వైశాఖ మాసంలో నెలకొల్పడంతో ఏటా ఇదే మాసంలో ఆరుద్ర నక్షత్రం రోజున రుద్రమూర్తికి అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అర్చకులు రుద్రమంత్రాలు పఠిస్తుండగా, శాస్త్రోక్తంగా పంచామృతాలు, గందోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, జలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రదేవునికి బిల్వార్చనను చేసి పుష్పార్చన చేపట్టారు. రుద్రుడి చల్లని చూపులు ఎప్పుడు కృష్ణానదిపై ప్రసరించడం వలన కృష్ణానదిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అలాగే శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడు పరిరక్షించబడుతుందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్. లవన్న, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు ధర్మరాజు, పర్యవేక్షకులు అయ్యన్న, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



రుద్రమూర్తికి అభిషేకాలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

క్లుప్తంగా

చైన్ స్నాచర్ అరెస్ట్

బేతంచెర్ల: పట్టణంలో ఈనెల 20వ తేదీన చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు మధురవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని ఆచూకీని గుర్తించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఇంటర్ విద్యార్థి అని తెలియడంతో పోలీసులు అవాక్కయ్యారు. మండలంలోని రహిమాన్‌పురం గ్రామంలో ఉంటున్న నిందితుడిని అరెస్ట్ చేసి 2.50 తులాల బంగారు గొలుసు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. త్వరితగతిన కేసును ఛేదించిన ఎస్‌ఐతోపాటు, పోలీస్ సిబ్బంది గురుబాబు, తిరుమలయ్య, శ్రీకాంత్, అశోక్‌ను డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ ప్రియతంరెడ్డి అభినందించారు.

సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధిశిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివ ప్రసాద్ తెలిపారు. 30 రోజుల శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులన్నారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్జిత సేవా టికెట్లు ఇక ఆన్‌లైన్‌లో..

- మే నెల కోటా విడుదల చేసిన ఈఓ
- మే 25 నుంచి 31 వరకు శ్రీశైలంలో మహాకుంభోత్సవం
- సీఎం జగన్ చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు


మే నెల ఆర్జితసేవల టికెట్లను బటన్ నొక్కి విడుదల చేస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: రోజు రోజుకు శ్రీశైల క్షేత్రానికి భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దేవస్థానం ఆర్జిత సేవా టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉంచింది. కరెంట్ బుకింగ్ కౌంటర్లు మూసివేయనున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండకుండా, క్యూలైన్‌లో వేచి ఉన్నా టికెట్ లభించక భక్తులు పలుమార్లు నిరుత్సాహానికి గురవుతున్న నేపథ్యంలో దేవస్థానం ఆన్‌లైన్ మార్గాన్ని ఎంచుకుంది. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు నిర్వహించే అన్ని ఆర్జిత సేవల టికెట్లను ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులో ఉంచింది. మే నెల టికెట్ల కోటాను మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఈఓ ఎస్.లవన్న కంప్యూటర్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. మంగళవారం నుంచి భక్తులకు ఆయా ఆర్జిత సేవా టికెట్లు, స్వామివారి స్పర్శదర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevasthanam.org ద్వారా భక్తులు ఆయా టికెట్లను పొందవచ్చు. ప్రతి నెల 25వ తేదీన ముందు నెలకు సంబంధించి ఆర్జితసేవా టికెట్లు, స్పర్శదర్శనం టికెట్లు అందుబాటులో ఉంచనున్నారు. భక్తులు రెండు రోజుల ముందుగా టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వ సెలవు రోజులు, పర్వదినాల్లో కాకుండా సాధారణ రోజుల్లో కూడా భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అందరూ సౌకర్యవంతంగా స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా ఆర్జితసేవలు, స్వామివారి స్పర్శ దర్శనం టికెట్ల జారీలో పలు మార్పులు చేశారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన ఆర్జితసేవాకర్తలకు టికెట్‌పై సూచించిన సమయంలో మాత్రమే ఆయా ఆర్జితసేవలను జరుపుకునే అవకాశం కల్పించారు. సేవాకర్తలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న టికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తమ వెంట తప్పనిసరిగా తెచ్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మే 25 నుంచి మహాకుంభాభిషేకం

శ్రీశైల మహాక్షేత్రంలో మే 25 నుంచి 31వ తేదీ వరకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శ్రీశైల క్షేత్ర సంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు, స్థానాచార్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఉత్సవంలో భాగంగా శివాజీ గోపురానికి కలశ ప్రతిష్ఠ, పంచమఠాల్లో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా క్షేత్రంలో నూతనంగా నిర్మించిన 224 వసతి గదుల సముదాయం (గణేశ సదనం), పంచమఠాలు ప్రారంభోత్సవం, రూ.75 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, ఆలయం ఎదురుగా శివవీధిలో పాలెమండపాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

> **“ భక్తుల సూచనల మేరకే ఆన్‌లైన్ సేవలు**
>
> భక్తుల సూచనల మేరకు అన్ని ఆర్జిత సేవల టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. కరెంట్ బుకింగ్‌ను రద్దు చేశాం. శీఘ్ర (రూ.150 టికెట్టు), అతి శీఘ్ర (రూ.300 టికెట్టు), ఉచిత దర్శనం యథాతథంగా కొనసాగుతాయి. అలాగే మంగళవారం నుంచి శుక్రవారం వరకు రోజు మధ్యాహ్నం సామాన్య భక్తుల సౌకర్యార్థం నిర్వహించే ఉచిత స్పర్శదర్శనం కూడా యథావిధిగా ఉంటుంది. భక్తులు ఈ మార్పులను గమనించి దేవస్థానానికి సహకరించాలి. – ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

ప్రేమను నిరాకరించిందని..

- యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన శివకుమార్‌ను కాపాడిన ఏపీఎస్‌డీఆర్ఎఫ్ టీమ్

కర్నూలు: ఓ యువతి తన ప్రేమను నిరాకరించిందని ఆదోని హుసేన్‌నగర్‌కు చెందిన బచకాయ శివకుమార్ (30) కృష్ణానదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఉపాధి నిమిత్తం శివకుమార్ కొన్ని నెలల క్రితం ఆదోని నుంచి ప్రకాశం జిల్లా చీమకుర్తికి వెళ్లి అక్కడ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసేవారు. అక్కడ ఒక యువతితో పరిచయం ఏర్పడి అది కాస్తా ప్రేమగా మారింది. ఆ యువతి ప్రేమను నిరాకరించినందుకు రెండు వారాల క్రితం చీమకుర్తి వెళ్లి విజయవాడ చేరుకుని అక్కడ కేటరింగ్‌లో పనిచేసేవాడు. మంగళవారం మధ్యాహ్నం యువతితో కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడి ఆవేశంతో సెల్‌ఫోన్‌ను నదిలో పడేసి అతను కూడా దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా ఆర్ఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి ఆధ్వర్యంలో దుర్గా ఘాట్‌లో విధులు నిర్వహిస్తున్న కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై శివకుమార్‌ను కాపాడి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.



అప్పుల బాధ తాళలేక..


మధు (ఫైల్)

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన చాబోల్ మధు(38) తనకున్న 0.75 ఎకరాల సొంత పొలంతో పాటు 5 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సీడుపత్తి సాగు చేశాడు. కుటుంబ ఖర్చులు, పెట్టుబడుల నిమిత్తం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 13 లక్షల వరకు అప్పులు చేశాడు. గత మూడేళ్లుగా పంట దిగుబడులు అంతంత మాత్రమే రావడంతో నష్టాలను చవిచూశాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో క్రిమి సంహారక గుళికలు మింగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువు సురేంద్ర ప్రథమ చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య మద్దిలేటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బనగానపల్లెరూరల్: యనకండ్ల గ్రామంలో ఈ నెల 20వ తేదీన భార్య మాధవిని చంపిన భర్త కొరపాటి నాగప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం నిందితుడి వివరాలను డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. యనకండ్లకు చెందిన నాగప్రసాద్ క్లీనర్‌గా పని చేస్తుండగా అతని భార్య మాధవి కూలీ పనులకు వెళ్లేది. భార్య తరచూ ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానించాడు. ఈ విషయంలో ఆమెతో ఘర్షణ పడుతుండటంతో హత్యకు వారం రోజుల క్రితం భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో ఇద్దరూ రాజీ కావడంతో కేసు ఉపసంహరించుకుంది. అయితే ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఈనెల 20వ తేదీ రాత్రి రోకలిబండతో తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు మంగళవారం గ్రామ వీఆర్‌వో ఎదుట భర్తను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సీఐ మల్లికార్జునగుప్తా, ఎస్‌ఐలు నవీన్‌బాబు, వీరాంజనేయులు మరోసారి నిందితుడిని విచారించి కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తామని..

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు రూ.7.80 లక్షలు తీసుకొని మోసం చేశారు. బాధితుడు న్యాయం కోసం మంగళవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. ముద్దవరం గ్రామానికి చెందిన కృష్ణ మోహన్ రెడ్డి, కర్నూలుకు చెందిన దినేష్ స్నేహితులు. ఈ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డికి ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తామని 2022 నవంబర్ నెలలో దినేష్‌తో పాటు ఆత్మకూర్‌కు చెందిన మంగలి దుర్గా ప్రసాద్ రూ.7.80 లక్షలు ఇప్పించుకున్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయడం తప్ప ఉద్యోగం ఇప్పించలేదు. తీసుకున్న డబ్బు చెల్లించలేదు. మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు.

డీసీసీబీని లాభాల బాట పట్టించాం

- కేడీసీసీబీ బోర్డు సమావేశంలో చైర్ పర్సన్ మహాలక్ష్మి వెల్లడి


డివిడెండ్‌ను చెక్ రూపంలో అందజేస్తున్న చైర్‌పర్సన్ మహాలక్ష్మి, సీఈఓ రామాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం షేక్ అప్సర్ జహాన్ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకును లాభాల బాట పట్టి సభ్యులైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు డివిడెండు ఇచ్చే స్థాయికి తెచ్చామని చైర్‌పర్సన్ ఎస్.మహాలక్ష్మి వెల్లడించారు. వరుసగా రెండవ ఏడాది కూడ పీఏసీఎస్‌లకు డివిడెంటు ఇవ్వడం ఆనందంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం కేడీసీసీబీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మహాలక్ష్మి అధ్యక్షతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిపిన లావాదేవీలపై అనంతపురం జిల్లాకు చెందిన ఆడిట్ టీమ్ చేపట్టిన ఆడిట్ రిపోర్టులకు బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2021–22లో డీసీసీబీకి రూ.3.05 కోట్ల నికర ఆదాయం రాగా.. ఇందులోంచి పీఏసీఎస్‌లకు రూ.60 లక్షల డివిడెండ్ ఇచ్చామన్నారు. 2022–23లో డీసీసీబీకి రూ.6.50 కోట్లు నికర ఆదాయం వచ్చిందని ప్రకటించారు. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) 4.65 నుంచి 4.60 శాతానికి తగ్గించినట్లు వివరించారు.

రాష్ట్రంలోనే కర్నూలు డీసీసీబీ 5వ అతిపెద్ద బ్యాంకు

బ్యాంకు టర్నోవర్ 2022 మార్చి 31 నాటికి రూ.2,800 కోట్లు ఉండగా.. దీనిని రూ.3500 కోట్లకు పెంచి.. రాష్ట్రంలోనే 5వ అతి పెద్ద బ్యాంకుగా తీర్చిదిద్దినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. 2023–24లో టర్నోవర్‌ను రూ.4,500కోట్లకు పెంచి ఏ–క్లాస్ బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 2023–24లో నికర లాభాలను రూ.20 కోట్లకు పెంచి పీఏసీఎస్‌లకు డివిడెండు కింద రూ.12 కోట్లు పంచాలనేది లక్ష్యమన్నారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ డీసీసీబీ బ్రాంచీల ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొంది చెల్లించకపోవడం వల్ల ఎన్‌పీఏలోకి వచ్చిన వాటిని రికవరీ చేసేందుకు వడ్డీ ఉపశమన పథకాన్ని జూన్ 30 వరకు పొడిగించినట్లు స్పష్టం చేశారు. ఈ రుణాలపై అపరాధ వడ్డీ మాఫీతో పాటు వడ్డీపై వడ్డీలో 75 శాతం లేదా రూ.50వేలకు మించకుండా మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలులోని పాతబస్తీ శాఖను మొదటి అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీవో ఎన్.రామాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం షేక్ అప్సర్ జహాన్, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుమంచిలో భగ్గుమన్న పాత కక్షలు


హత్యకు గురైన హనుమంతు

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో పాత కక్షలు భగ్గుమన్నాయి. మంగళవారం హనుమంతు(50) అనే వ్యక్తిని ప్రత్యర్థులు దారి కాచి దారుణంగా హతమార్చారు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. 15 ఏళ్ల క్రితం కారుమంచి గ్రామంలో చెన్నప్ప, పోతప్ప హత్య కేసులో హనుమంతు నిందితుడు. రెండు హత్యలు జరిగిన తరువాత హనుమంతు కారుమంచి గ్రామం విడిచి దేవనకొండ మండలం పొట్లపాడులో భార్య, బిడ్డలతో కాపురం ఉంటున్నాడు. అయితే మంగళవారం బైలుపత్తికొండలో బంధువులు సుంకులమ్మవ్వ దేవర చేశారు. హనుమంతు దేవరలో పాల్గొని భోజనం చేసిన తర్వాత తిరిగి పొట్లపాడుకు ఇద్దరు బంధువులతో బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో వెంగళాయిదొడ్డి ఆయకట్టు చెరువు వద్ద ప్రత్యర్థులు కాపు కాచి మారణాధాయాలతో దాడి చేసి హనుమంతును హత్య చేశారు. ఈ హత్యలో నలుగురు పాల్గొన్నట్లు సమాచారం ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కారుమంచిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ఇద్దరికి గాయాలు

శ్రీశైలం: శ్రీశైలం – దోర్నాల ఘాట్ రోడ్డులో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శ్రీశైలానికి 25 కి.మీ దూరంలో దోర్నాల నుంచి శ్రీశైలం వస్తున్న కారు, శ్రీశైలం నుంచి కర్నూలు వెళ్తున్న మరో కారు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కర్నూలుకు చెందిన లక్ష్మీదేవి (55), ఆమె కుమారుడు సోమేష్(18) గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో కొద్ది సేపు ఇరువైపుల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకాశం జిల్లా దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

28, 29 తేదీల్లో విద్యార్థులకు ప్రగతి పత్రాలు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమ్మెటివ్–2 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి ఈ నెల 28, 29 తేదీల్లో విద్యార్థులకు అందజేయాలని డీఈఓ డా.వి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీన అన్ని స్కూళ్లలో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేయాలన్నారు.

ఖాతాదారులకు సంతృప్తికర సేవల్లో ముందంజ

- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్: ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో ఇతర బ్యాంకులకు ఏమాత్రం తీసిపోని రీతిలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. తమ బ్యాంకు రూ.41,656 కోట్ల వ్యాపారంతో గడిచిన సంవత్సర కాలంలో రూ.595.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.2398.42 కోట్ల అదనపు వ్యాపారాన్ని నిర్వహించి 6.11 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకున్నామన్నారు. ఖాతాదారులకు ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందిస్తున్నామని, 98 ఏటీఎంలు ఏర్పాటు చేశామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యాపార లక్ష్యాన్ని రూ.45,500 కోట్లుగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు డిజిటల్ లెండింగ్, సోషల్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా నగదు ఉపసంహరణ తదితర ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో బ్యాంకు జీఎంలు జగదీశ్వర్‌రావు, కె.విజయభాస్కర్, పీఆర్ పడగెటవార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక సేవకు శ్రీకారం

- భక్తుల నుంచి విశేష స్పందన


ఉచిత సామూహిక సేవలో పాల్గొన్న సామాన్య భక్తులు

శ్రీశైలంటెంపుల్: తెల్లరేషన్ కార్డు కలిగిన భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ఉచిత సామూహిక సేవకు శ్రీకారం చుట్టింది. మంగళవారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీశైలంలోని చంద్రావతి కల్యాణ మండపంలో నిర్వహించిన సామూహిక అభిషేకాల్లో స్థానికులే కాకుండా హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, గుంటూరు, ధర్మవరం, మార్కాపురం, చీరాల, నాగాయలంక తదితర ప్రాంతాలకు చెందిన 250 మంది భక్తులు పాల్గొన్నారు. ముందుగా భక్తులందరి గోత్రనామాలతో సంకల్పం జరిపించిన అనంతరం కలశపూజ జరిపారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అభిషేక పూజల అనంతరం భక్తులకు స్వామివార్ల స్పర్శదర్శనం కల్పించారు. దేవస్థానం అధికారులు సేవాకర్తలకు 2 లడ్డూ ప్రసాదాలు, కుంకుమ, విభూతి, కైలాసకంకణాలు, శ్రీశైలప్రభ మాసపత్రిక అందజేసి భోజన సదుపాయం కల్పించారు. అనంతరం ఈఓ లవన్న మాట్లాడుతూ సామాన్య భక్తుల సౌకర్యార్థం ఉచిత సామూహిక సేవలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతి నెలలో 250 మందికి ఈ అవకాశం కల్పిస్తామన్నారు. ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు ధర్మరాజు, ఆలయ ఏఈఓ హరిదాసు, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు సాయికుమారి, అయ్యన్న, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంత్యుత్సవం


శంకరాచార్యులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలోని ఫాలధార–పంచధార వద్ద మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తరీతిలో విశేష పూజలను ఈఓ లవన్న, అర్చకులు చేపట్టారు. చతుర్వేద శాస్త్రపురాణ పారాయణలతో జరిగిన ఈ పూజల్లో చంద్రమౌళీశ్వర స్వామికి, శారదాదేవికి, శంకరాచార్యులకు పంచామృతాభిషేకం, పుణ్యజలాభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ ఫాలధార పంచధార వద్ద శంకరాచార్యులు తపస్సు చేసి శివానందలహరి అనే గ్రంథాన్ని రచించినట్లు క్షేత్రసాహిత్యం ద్వారా తెలుస్తుందన్నారు. అలాగే భ్రమరాంబదేవి ఆలయంలో జరుగుతున్న వామాచార (జంతుబలి) సంప్రదాయాన్ని మార్చి దక్షిణాచార (సాత్వికబలి) సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారని, ఇందుకు శ్రీచక్రాన్ని అమ్మవారి ఆలయప్రాంగణంలో ప్రతిష్ఠించినట్లు ఆయన రాసిన గ్రంథంలో ఉందన్నారు. నిత్యకళారాధన వేదికపై ఆదిశంకరుల జీవిత విశేషాలపై ఉన్నవ గణేశ్, జిల్లేళ్లమూడి బాపట్ల వారి ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

క్లుప్తంగా

వండర్ కిడ్‌కు అభినందన



మోక్ష అయాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): రెండేళ్ల వయస్సు నిండక ముందే అద్భుతాలు సృష్టిస్తున్న వండర్ కిడ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు దంపతులు సేవలా శివ, స్వప్నికల కుమారుడు మోక్ష అయాన్‌ను ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే మంగళవారం చిన్నారి కుటుంబ సభ్యులను కలిశారు. జంతువులను గుర్తిస్తూ వాటి శబ్దాలను అనుకరిస్తూ అబ్బురపరుస్తున్న అయాన్ జ్ఞాపకశక్తి ఎంతో అపారమైనదని ఆయన కొనియాడారు.

29న గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి మౌఖిక పరీక్ష

నంద్యాల(సిటీ): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) కోర్సులకు కంప్యూటర్ సబ్జెక్టును బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులను గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శశికళ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంటెక్ తదితర విభాగాల్లో కంప్యూటర్ సైన్స్ ప్రధాన సబ్జెక్టుగా కలిగిన వారు పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే మౌఖిక పరీక్షలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985883900 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వీరజవాన్లకు నివాళులు



ర్యాలీలో మాట్లాడుతున్న బసవరాజు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల పూంచ్ సెక్టార్‌లో ఉగ్రవాదుల దాడిలో వీర మరణం పొందిన జవాన్‌లకు హిందూ దేవాలయ పరిరక్షణ సమితి, దుర్గాశక్తి మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హిందూదేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు సల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బొమ్మలసత్రం: ఆధార్, వ్యక్తిగత సమాచారం, వేలిముద్రల ఆధారంగా సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయం చేస్తున్నారని , ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖాతాల నుంచి నగదు మాయమవుతుందనే ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు నగదు అవసరమైతే ఏటీఎం కార్డు అవసరం లేకుండా ఏటీఎమ్‌లో నగదు పొందేందుకు ప్రభుత్వం ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల ఆధార్ వివరాలు, వేలిముద్రలు సేకరించి నగదు మాయం చేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆధార్‌ను లాక్ చేసి ఉంచుకోవాలన్నారు. దీని వల్ల అకౌంట్ నుంచి నగదు మాయం కాదన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

రుద్రవరం: మండలంలోని ఆయా గ్రామాల్లో మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన వారు ఉచిత విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించి వెంటనే ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జయరాముడు, నరేష్, శిరీష పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలి

రుద్రవరం: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేడే సంబరాలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, మండల నాయకుడు శంకర్, సీఐటీయూ నాయకులు సుబ్బరాయుడు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కర్షకులు, కార్మికుల కుటుంబాల్లోని కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఏప్రిల్ 30న స్థానిక హైస్కూల్ మైదానంలో సీఐటీయూ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కళాకారుల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. చెక్కభజన కళాకారులు, పౌరాణిక నాటకాల ప్రదర్శన, చిన్నారుల నృత్యాలు, డప్పు, తప్పెట వంటి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.


నీటి పథకాలకు ప్రతిపాదనలు

ఉయ్యాలవాడ: వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి, నీటి పథకాల నిర్వహణకు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌క్రిష్ణ మంగళవారం తెలిపారు.

మారిన వ్యవస్థ .. తీరిన అవస్థ

వాగులపై వంతెనలు లేక జి.జంబులదిన్నె, నందింపల్లె గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా అష్టకష్టాలు పడ్డారు. వాగులు దాటే క్రమంలో ఒక్కోసారి ప్రమాదాల బారిన పడేవారు. ఎన్నో వినతులు, వేడుకోళ్ల తర్వాత 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రెండు గ్రామాల వంతెనలు మంజూరు చేసినప్పటికీ నిధులు లేవనే కారణంతో పునాదుల్లోనే పనులను ఆపేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు గ్రామాల వంతెనల నిర్మాణాలు వేగవంతమయ్యాయి. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో జి.జంబులదిన్నె, నందింపల్లె గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థ మారడంతో ఆ రెండు గ్రామాల ప్రజల దశాబ్దాల అవస్థ తీరిపోయింది.

- టీడీపీ హయాంలో నిలిచిన జి.జంబులదిన్నె, నందిపల్లె వంతెనల నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే చకచకా పనులు
- నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో గ్రామస్తుల హర్షం



నందింపల్లెలోని నల్లవాగుపై నిర్మించిన బ్రిడ్జి



గతంలో ఉన్న బత్తలూరు-నందింపల్లె నల్లవాగులో చిక్కుకున్న వ్యక్తిని తాడుతో లాగుతున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని జి.జంబులదిన్నె గ్రామస్తుల వేల ఎకరాల పొలాలు వక్కిలేరు దాటిన తర్వాత ఉన్నాయి. దీంతో వాగు దాటి సాగు చేయాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. దిక్కుతోచని రైతులు గూబగుండం, నల్లగట్ల, పేరాయిపల్లె, గోపాలపురం గ్రాస్తులకు కౌలుకు ఇచ్చేవారు. అలాగే నంద్యాలకు వెళ్లాల్సి వచ్చినా గ్రామస్తులు అగచాట్లు పడేవారు. ప్రస్తుతం రూ.5.60 కోట్లతో బ్రిడ్జి నిర్మించడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రూ.2.50 కోట్లతో నల్లవాగుపై బ్రిడ్జి నిర్మాణం

నందింపల్లె-బత్తలూరు గ్రామాల ప్రజలు నల్లవాగు దాటాలంటే అష్టకష్టాలు పడేవారు. ప్రస్తుతం రూ.2.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు రాకపోకలు సంబరంగా సాగిస్తున్నారు. రెండు గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులకు వంతెన లేకపోవడంతో గతంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఏళ్ల నాటి కల సాకారం కావడంతో నందింపల్లె గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో జి.జంబులదిన్నె వక్కిలేరు దాటేందుకు పడుతున్న కష్టాలు(ఫైల్)

చీకటి పడితే అంతే..

రెండు గ్రామాల ప్రజలు అవసరం నిమిత్తం పొలాలు, వేరే పట్టణాలు, పల్లెలకు వెళ్తే చీకటి పడక ముందే ఊర్లు చేరుకోవాల్సి వచ్చేది. ఒకవేళ ఆలస్యమై చీకటి వేళల్లో వాగు దాటాలంటే నీటి ఉధృతిలో కొట్టుకుపోయే ప్రమాదం ఉండేది. దీంతో ఎట్టి పరిస్థితిల్లో పొద్దుగూకక ముందే ఇళ్లకు చేరుకునే వారు. ప్రస్తుతం జి.జంబులదిన్నె, నందింపల్లె గ్రామాల ప్రజలకు ఏ సమయంలోనైనా రాకపోకలు సాగించవచ్చని హర్షిస్తున్నారు.

పెరిగిన భూముల ధరలు

జి.జంబులదిన్నెలోని వక్కిలేరుపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్తులు కౌలుకు ఇవ్వకుండా సొంతగా సాగు చేసుకుంటున్నారు. ఇక బ్రిడ్జి రాదు ఇలా ఎన్నాళ్లని కౌలుకు ఇస్తాం ఇక అమ్మేద్దాం అనుకున్న సమయంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కావడంతో వ్యవసాయ మార్గం సుగుమం అయ్యింది. దీంతో ఎకరం రూ.5 లక్షలు ఉండే పొలం ఇప్పుడు ఎకరం రూ.10 లక్షలు దాటిపోయింది. వంతెన కింద గ్రామానికి చెందిన రైతులకు 520 ఎకరాలు సాగుభూమి ఉండటం గమనార్హం. ఎన్నో ఏళ్లుగా సాగుకు దూరమైన గ్రామస్తులు ప్రస్తుతం ఏరువాక ఆనందంగా సాగిస్తున్నారు.



జంబులదిన్నె వక్కిలేరుపై నిర్మించిన బ్రిడ్జిపై కొనసాగుతున్న రాకపోకలు

బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేశాం

గ్రామస్తుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేశాం. రెండు బ్రిడ్జిలకు రూ.8.10 కోట్లతో నిర్మించాం. రాకపోకలకు గ్రామస్తులకు చాలా ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు రాష్ట్ర స్థాయిలో ఒత్తిడి తీసుకు వచ్చారు. దీంతో పనులు త్వరగా పూర్తయ్యాయి. దశాబ్దాల కల నెరవేరడంతో గ్రామ ప్రజలు ఆనందంగా ఉన్నారు. అంత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మించాం.

– సుబ్బరాయుడు, ఆర్అండ్‌బీ డీఈ



వంతెన కల సాకారమైంది

వక్కిలేరు దాటి ఎన్నో ఇబ్బందులు పడుతూ గ్రామం చేరుకూనే వాళ్లం. గత 60 ఏళ్లుగా వ్యవసాయానికి దూరమయ్యాం. వేరు గ్రామాల వారికి కౌలుకు ఇచ్చే వాళ్లం. ప్రస్తుతం మేమే పంటలను ఎలాంటి అగచాట్లు లేకుండా సాగుచేసుకుంటున్నాం. అలాగే రాకపోకలకు జాతీయ రహదారి చేరుకోవడానికి కేవలం 1.50 కిలో మీటర్లు మాత్రమే ఉంది. – అసాన్, జి.జంబులదిన్నె



మూడు తరాలుగా ఎదురు చూస్తున్నాం

బత్తలూరు-నిందింపల్లె గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం మూడు తరాలుగా ఎదురు చూస్తున్నాం. మా ముత్తాతల కాలం నుంచి ఎన్నో అగచాట్లు పడ్డాం. ఇక బ్రిడ్జిని చూడలేమనుకున్నాం. ఇక వ్యవసాయ పనులు, రాకపోకలకు ఎంతగానో ఉపయోగ కరంగా ఉంటుంది. మాసమస్యలను గుర్తించి వంతెన నిర్మాణానికి సహకారం అందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు. – గోపాల్, నందింపల్లె

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ నగర్‌లో రూ.1.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా టీడీపీ నాయకులకు కనపడటం లేదన్నారు. 38వ వార్డులోనే రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.80 లక్షలతో మెయిన్ డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. నాడు నేడు పనుల్లో భాగంగా కేజీబీవీ, మైనార్టీ పాఠశాలలను ఆధునీకరించామన్నారు. ఉర్దూ పాఠశాల నిర్మాణం చివరి దశలో ఉందన్నారు. రూ.1.25 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం తగదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వైఎస్సార్‌నగర్ ఏర్పాటు చేసిన 6,500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, రెండు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ, ఇన్‌చార్జ్ టీవీ రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగన్న, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకాలయ్య, అన్వర్‌బాషా, నరసింహారావు, వెంకటస్వామి శెట్టి, బాబురావు, సోమశేఖర్, జాకీర్, కృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్డులు, డ్రైనేజీ కాల్వలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

క్రీడల్లోయువత రాణించాలి



బ్యాటింగ్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రుద్రవరం: క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో నిర్వహించిన సమ్మర్ యూత్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు ఎర్రగుడిదిన్నె, చిన్నకంబలూరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఇలాంటి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల పట్ల మానసిక ఉల్లాసంతో పాటు మంచి స్నేహితులను పొందుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచ్ చెన్నప్ప, కోఆప్షన్ మెంబర్ మదార్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, శివారెడ్డి, నిర్వాహకులు బాలీశ్వర్‌రెడ్డి, రమేష్, భూపాల్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

హైందవ ధర్మోద్ధారకుడు ఆది శంకరాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): హైందవ ధర్మోద్ధారకుడు ఆదిశంకరాచార్యులని బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రథమనంది ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని నిర్వహించారు. శంకరాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు, అష్టోత్తరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదచారియే దేశమంతా సంచరించి నాలుగు పీఠాలను నాలుగు మూలలా స్థాపించి ధర్మప్రతిష్ట చేసిన మహానుభావుడన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కేశవమూర్తి, సుధీంద్రాచార్యులు, సీతారామ శర్మ, రమేష్ పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

ఉమామహేశ్వర ఆశ్రమంలో.. : సంజీవనగర్‌లోని శఉమామహేశ్వర ఆశ్రమంలో ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపన్యాసకులు తిప్పయ్యస్వామి, ఆదిశంకరాచార్యుల బోధనలను భక్తులకు వివరించారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

నంద్యాల(వ్యవసాయం): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని కోరుతూ జిల్లా జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ శాఖ అధికారులకు కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ తూము శివారెడ్డిలు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు.

బకాయిల వసూలుకు చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని గృహ, వ్యాపార సముదాయాల నెలవారీ సేవా రుసుము బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బకాయిల వసూలుకు 4 బృందాలను నియమించామన్నారు. వారు వ్యాపార దుకాణాలు, గృహాల యజమానులకు నోటీసుల జారీ చేసి, బకాయిలు రాబడుతున్నారన్నారు. అందులో భాగంగా పద్మావతి నగర్‌లోని రిలయన్స్ మార్ట్, నాగార్జున కళాశాలల వద్దకు ప్రత్యేక బృందం సభ్యులు అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి వెళ్లి బకాయిలను చెల్లించాలని కోరారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అస్లాం, రవి, జాఫర్, షరీఫ్, హుసేనప్ప, ఏసన్న, పఠాన్ సర్దార్, చిన్నస్వామి, లింగారెడ్డి, బాలమద్దిలేటి, మునిస్వామి, శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.48,430 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

కేసు కొట్టివేతపై హర్షం

నంద్యాల(అర్బన్): బోయ ఉద్యమ కారులపై గత ప్రభుత్వం పెట్టిన కేసును విజయవాడ కోర్టు కొట్టివేయడంపై వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యక్షులు పులికొండన్నలు హర్షం వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణంలో కేసు కొట్టివేతకు కృషి చేసిన లాయర్లతో కలిసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గిడ్డయ్య, రాష్ట్ర నాయకులు సురేష్, మహేంద్ర, నర్సన్న, రాంభీమ్‌నాయుడు, మధు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆర్గనైజర్ మృతి

గోస్పాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ ఆర్గనైజర్ మోహన్(50) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోహన్ కోలుకోలేక సోమవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు కాంతరావు నాయక్, గోపాల్, వైద్యసిబ్బంది మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులకు విద్యుత్ మేళా

- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన గురువారం ఎస్సార్బీసీ కాలనీలోని టిడ్కో గృహాల పట్టాలు పొందిన 1,024 మంది లబ్ధిదారులకు ఏపీఎస్పీడీసీఎల్ నంద్యాల విద్యుత్ శాఖ వారి ఆధ్వర్యంలో విద్యుత్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఏపీ స్టేట్ బోర్డు డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. సంబంధిత టిడ్కో గృహాల లబ్ధిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ గృహాలకు అవసరమయ్యే విద్యుత్ మీటర్లను పొందవచ్చన్నారు.

సంక్షిప్తం

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి ఉద్యోగులకు రావాల్సిన డీఏలను విడుదల చేయాలని నంద్యాల జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ రామచంద్రారావు కోరారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా నాయకులు ఏసురత్నం, లక్ష్మణ్, గౌస్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి, రాఘవేంద్రయ్య, నాగరాజు, విజయశేఖర్, సుభాకర్, రామసంజీవ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలి

నంద్యాల(వ్యవసాయం): ఆహారపు అలవాట్లలో చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలకు ప్రాధాన్యత ఇవ్వాలని డైటీషియన్ డాక్టర్ తేజశ్వణి సూచించారు. మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బాలికల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల ప్రాధాన్యత అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నేటి యువత ఎక్కువగా జంక్ ఫుడ్ తీసుకొని చిన్న వయస్సులోనే అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. వీటి వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. చిన్నప్పటి నుంచే చిరుధాన్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా, మానసింగా, దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ లలితాసరస్వతి పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ చర్యలు హేయమైనవి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ చర్యలు హేయమైనవని ఎస్‌టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ చర్యలు ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ప్రమాదముందన్నారు. ఇప్పటికైనా వారి వైఖరి మార్చుకోకపోతే ఎస్‌టీయూ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డులో మంటలు

నంద్యాల (సిటీ): పట్టణ శివారులోని డంప్‌యార్డులో మంగళవారం మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా డంప్‌యార్డులోని లెగసీ శుభ్రం చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇదే విషయాన్ని 'సాక్షి' పలుమార్లు కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. నిర్లక్ష్య ఫలితమే మంటలకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సుభిక్ష పాలన అందిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కానాల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ బావమ్మ, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు జమీరుద్దీన్, రంగారావు, చిన్నయ్య, హుస్సేని, ఖాసీం పాల్గొన్నారు.

మేడే ఉత్సవాల కరపత్రాలు విడుదల

నంద్యాల(అర్బన్): మేడే ఉత్సవాల కరపత్రాలను మంగళవారం ఐఎఫ్‌టీయూ నాయకులు యూనియన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ దీర్ఘకాల పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలు చేసి కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కార్మికుల పొట్టగొడుతోందన్నారు. సమావేశంలో నాయకులు చౌడప్ప, మహమ్మద్, ఇర్ఫాన్‌బాషా, రఫీ, పఠాన్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

ఆళ్లగడ్డ: మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రం చాగలమర్రి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమ్రాన్ మాట్లాడుతూ మలేరియా నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, చలితో కూడిన జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రమణమ్మ, సూపర్వైజర్లు రామలింగారెడ్డి, రామచంద్రుడు, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

– దొర్నిపాడు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తిని నివారించడంతోపాటు మలేరియా వ్యాధి దరిచేరదని జెడ్పీటీసీ శకుంతలా రెడ్డి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు నాగేంద్ర, రుహుల్లాఖాన్ పాల్గొన్నారు.

- ఉయ్యాలవాడ: స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్‌చంద్రబాలాజీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉయ్యాలవాడలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- శిరివెళ్ల: స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు.
- గోస్పాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కాంతరావునాయక్, గోపాల్ ఆధ్వర్యంలో కానాల గ్రామంలో వైద్య సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.